క్లుప్తంగా

ఎయిడ్స్‌పై అవగాహన

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామంలో గురువారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీటీసీ డీఎస్ఆర్‌సీ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్ఐవీ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సర్పంచ్ సంగెం నర్సన్న, భైంసా వైద్య సిబ్బంది విలాస్, సతీశ్, ల్యాబ్ టెక్నీషియన్ తోఫిక్, సుధాకర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

భూమిపూజ

నర్సాపూర్(జి): మండలంలోని బామిని(బి) గ్రామంలో సర్పంచ్ దేవోల్ల పుష్పల, అంజనీ తండా, బూర్గుపల్లి(జి) గ్రామాల్లో ఎంపీపీ కొంద్ర రేఖ, కుస్లీలో జెడ్పీటీసీ చిన్న రామయ్య పంచాయతీ భవనాలకు గురువారం భూమిపూజ చేశారు. ఒక్కో గ్రామ పంచాయతీ భవనానికి రూ.20 లక్షలు మంజూరైనట్లు పీఆర్ ఏఈ సూర్యతేజ పేర్కొన్నారు. అంజనీ తండా సర్పంచ్ జాదవ్ అంజనాబాయి, బూర్గుపల్లి (జి)సర్పంచ్ విఠాబాయి, కుస్లీ సర్పంచ్ స్వరూప, ఎంపీడీఓ వనజ, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేసిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

లక్ష్మణచాంద: మండలంలో భారీ వర్షాలకు రాచాపూర్–పీచర గ్రామాల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వంగిపోయింది. దీంతో సమీపంలో విద్యుత్ సరఫరా కాలేదు. దీనిపై ఈనెల 14న సాక్షిలో విద్యుత్ నియంత్రికను సరిచేయరూ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు గురువారం ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేశారు.

తహసీల్దార్‌కు వినతి

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో అంబేద్కర్ సంఘ భవనం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ గురువారం కాలనీవాసులు తహసీల్దార్ కవితారెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఎస్సీ సంఘ భవనం పక్కనే స్థలం కేటాయించాలని వారు కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఖానాపూర్ జడ్జి జితిన్

ఖానాపూర్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారానే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తపేట్‌లో ప్రజలతో నిర్వహించిన న్యాయసేవలపై అవగాహన సదస్సులో మాట్లాడారు. నిరుపేదలకు న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఉచిత సేవలు అందిస్తామన్నారు. విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించాలన్నారు. సర్పంచ్ సునీత, ఎస్సై ఆర్.శంకర్, న్యాయవాదులు సురేష్, వెంకట్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

స్థలదాతలకు సన్మానం

కుంటాల: మండలంలోని పాతవెంకూర్‌లో పంచాయతీ కార్యాలయ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు కేటాయించింది. భవనానికి స్థలం లేకపోవడంతో దాతలు టీకాజీ పటేల్, భోజారాం పటేల్, సంతోష్, భోజాబాయి ముందుకొచ్చి రూ.ఎనిమిది లక్షల విలువైన మూడు గుంటల స్థలం అందించారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు అభినందించి సన్మానించారు. జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి, సర్పంచ్ మగ్గిడి శృతి, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, పీఆర్ డీఈ సురేశ్, ఎంపీఓ రహీం, గ్రామ దిగంబర్, దత్తురాం బాజీరావు పటేల్, రమేష్, సుధాకర్, సారిక తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల రాస్తారోకో

నర్సాపూర్(జి): బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థినుల ఆత్మహత్యలకు నిరసనగా గురువారం నర్సాపూర్(జి)లో 61వ జాతీయ రహదారిపై బీజేపీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. బాధితుల కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. అర్జున్ ఠాకూర్, రాజేందర్, శేఖర్, నరేందర్, లక్ష్మణ్, సాయికృష్ణ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

డీఈవోకు వినతి

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ గురువారం డీఈవో రవీందర్ రెడ్డికి విద్యా కమిటీ చైర్మన్ దాసరి వెంకటరమణ వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న నలుగురు ఉపాధ్యాయులు పాఠాలు బోధించేందుకు సరిపోవడం లేదన్నారు. ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

చేపల వేటనే జీవనోపాధి.!

- జిల్లాలో ఎనిమిది వేల కుటుంబాలు
- గోదావరి సమీపంలో ఫిష్ మార్కెట్ కరువు
- ఒడ్డున దళారులు చెప్పిందే రేటు
- తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్న మత్స్యకారులు



తెప్పలపై వేటకు వెళ్తున్న మత్స్యకారులు



పంచగుడిలో ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో వల వేస్తున్న మత్స్యకారుడు

లోకేశ్వరం: ప్రాణాలకు తెగించి.. చేపల వేటనే నమ్ముకొని జీవనం సాగించే మత్స్యకార కుటుంబాలు జిల్లాలో ఎనిమిది వేల వరకు ఉన్నాయి. కాలాలకు అతీతంగా నిద్ర లేచిన వెంటనే వారి పయనం గోదావరి వైపు ఉంటుంది. తెప్పలతో గోదావరి గర్భంలోకి వల వేసి చేపల వేట సాగిస్తారు. వలకు చేపలు పడితే ఆ రోజు గడుస్తుంది.. లేదంటే మరుసటి రోజు మళ్లీ యథావిధిగా ప్రయత్నం చేయడమే వారికి తెలిసింది. జిల్లాలోని ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ గోదావరిలో ప్రభుత్వం చేపపిల్లలను వదులుతుండటంతో దిలావర్‌పూర్, నర్సాపూర్(జి), కుంటాల, లోకేశ్వరం, ముధోల్, బాసర మండలాల్లో మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారని.. ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వేట సాగిస్తారిలా...

గోదావరి నదిలో చేపల వేట నిరంతరం సాగుతుంది. కొందరు మత్స్యకారులు సాయంత్రం గోదావరిలో కండ్రీలు(వలలు) వేసి మరుసటి రోజు తెల్లవారుజామున వరకు చేపలను వేటాడి ఇళ్లకు వస్తారు. మరికొందరు తెల్లవారు జామున నాలుగు నుంచి తొమ్మిది గంటల వరకు చేపల వేట కొనసాగిస్తుంటారు. థర్మకోల్‌తో తయారు చేసుకున్న తెప్పలను చేపలు పట్టేందుకు వినియోగిస్తుంటారు. మత్స్యకారులు ఉదయం 4:30 గంటలకు ఇంటి నుంచి బయలుదేరి 5:30 గంటల వరకు గోదావరి వద్దకు చేరుకుంటారు. అల్పాహారం చేసి గోదావరిలోకి వేటకు వెళ్తారు. ఉదయం 9 నుంచి 10 గంటల సమయంలో పట్టిన చేపలను తీరం వద్దే దళారులకు విక్రయించుకుని ఇంటికి చేరుకుంటారు. మధ్యాహ్నం విశ్రాంతి తీసుకొని వలలను సరి చేసుకొని రేపటి కోసం సిద్ధం చేసుకుంటారు.

ఒడ్డున దళారులకే విక్రయం..

గోదావరిలో తాము పట్టిన చేపలను మత్స్యకారులు అధికశాతం దళారులకు విక్రయిస్తారు. ఒడ్డుకు తీసుకురాగానే అక్కడున్న దళారులకే కొనుగోలు చేస్తారు. సమీపంలో ఎక్కడా మార్కెట్ లేకపోవడంతో వారు చెప్పిన రేటుకే విక్రయిస్తారు. తమ వలల కోసం దళారుల వద్ద కొంత అడ్వాన్స్ తీసుకొని.. గోదావరిలో పట్టిన చేపలను తక్కువ ధరకే విక్రయించేలా ముందే ఒప్పందం చేసుకుంటారు. దీంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ప్రమాద బీమా ఇలా..

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశత్తు మరణించిన మత్స్యకారులకు ప్రభుత్వం ప్రమాదబీమా అందించి ఆదుకుంటుంది. మత్స్య సహకార సంఘంలో సభ్యుడై ఉన్న మత్స్యకారుడికి ప్రభుత్వం ప్రమాద బీమా అందిస్తుంది. 10 నుంచి 70 ఏళ్ల మత్స్యకారులకు పీఎం సురక్ష యోజన పథకం కింద రూ.2 లక్షల బీమా, రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా వర్తింపజేస్తుంది. మరో వైపు ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకం ద్వారా 18నుంచి 50 ఏళ్ల లోపు మత్స్యకారులకు రూ.రెండు లక్షల బీమా, రూ.నాలుగు లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తుందని మత్స్యశాఖ అధికారులు తెలిపారు.



దళారికి చేపలు విక్రయిస్తున్న మత్స్యకారుడు

సహకారం అందిస్తున్న ప్రభుత్వం..

నూరు శాతం సబ్సిడీపై చేప, రొయ్య పిల్లలను చెరువులు, రిజర్వాయర్లలో వదులుతున్నారు. చేపలు పడితే రోజుకు రూ.500 తక్కువ కాకుండా గిట్టుబాటు అవుతుందని మత్స్యకారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి మార్కెట్ ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.

ఉదయమే గోదావరిలోకి..



గోదావరిలో చేపల వేటకు ఉదయం తెప్పలపై పోతాం. వలలు చేస్తుండగా పెద్దపెద్ద పాములు కూడా అందులో పడతాయి. వేటకు వెళ్లి ఇంటికి వచ్చే వరకు కుటుంబసభ్యులు ఆందోళన చెందుతుంటారు. ప్రమాదం జరగవద్దని దేవుడ్ని మొక్కుకుంటాం.

– లస్మన్న, ధర్మోర, మత్స్యకారుడు

మార్కెట్ ఏర్పాటు చేయాలి



పట్టిన చేపలను అమ్ముకునేందుకు గోదావరి సమీపంలో ఎక్కడా పెద్ద మార్కెట్ లేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. గోదావరి వద్దకు వచ్చే సేట్లకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నాం. మార్కెట్ సమస్య పెద్దగా ఉంది.

– సాయన్న, పంచగుడి, మత్స్యకారుడు

మార్కెట్ భవనం కోసం రూ.10 లక్షలు

జిల్లాలో ఏయే గ్రామంలోనైనా మత్స్య సహకార సంఘం ఉన్న చోట స్థలం కేటాయిస్తే వారి సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తాం. ఈ భవనంలో మార్కెట్ ఏర్పాటు చేసుకొని చేపల క్రయవిక్రయాలు, సమావేశాలు నిర్వహించుకోవచ్చు. ప్రభుత్వం మత్స్యకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది.


– నరసింహారావు, జిల్లా మత్స్యశాఖ ఏడీ

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	30
వంకాయ	60
బెండకాయ	60
పచ్చిమిర్చి	90
కాకరకాయ	70
బీరకాయ	60
క్యారెట్	100
గోరుచిక్కుడు	50
కొత్తిమీర	120
అల్లం	200
ఎల్లిగడ్డ	120
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	30

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : ఆదిపురుష్
నారాయణ : ఆదిపురుష్

సన్మానం

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి యోగేశ్వర ఎత్తిపోతల పథకం చైర్‌పర్సన్ మామిడి గంగవ్వను గురువారం ధర్మోరలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, సర్పంచ్ శారద, మాజీ సర్పంచ్ కథం శ్రీనివాస్‌రావు, అనిల్, రమేశ్‌గౌడ్ ఉన్నారు.

దేశానికే ఆదర్శంగా తెలంగాణ పల్లెలు

- ఎమ్మెల్యే రేఖానాయక్
- ఘనంగా పల్లెప్రగతి దినోత్సవం



ఖానాపూర్: భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే



లోకేశ్వరం మండలం ధర్మోరలో..



లక్ష్మణచాంద: పొట్టపెల్లిలో జెండావిష్కరణ



మామడ: పొన్కల్‌లో కార్మికులకు సన్మానం



కుంటాల: కల్లూర్‌లో పారిశుధ్య కార్మికుడి కాళ్లు కడుగుతున్న సర్పంచ్ దంపతులు

ఖానాపూర్: అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ పల్లెలు నిలుస్తున్నాయని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండలంలోని బాదనకుర్తి–చింతలపేట్ గ్రామాలకు రూ.కోటి నిధులతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రేఖానాయక్ భూమిపూజ చేశారు. అనంతరం పల్లె ప్రగతి దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని గౌడ సంఘం భవనానికి భూమిపూజ చేశారు. పోచమ్మ అలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చింతల్‌పేట కమ్యూనిటీ హాల్ కోసం రూ.ఐదు లక్షలు కేటాయిస్తామన్నారు. చింతల్‌పేట్ ప్రత్యేక పంచాయతీ విషయం ప్రభుత్వం దృష్టిలో ఉందన్నారు. ఐటీడీఏ అభివృద్ధి పనుల విషయమై ప్రోటోకాల్ పాటించడం లేదని ఎంపీపీ మోహిద్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు మహిళలు తమకు పెన్షన్‌లు రావడం లేదని ఎమ్మెల్యేకు వివరించగా సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్శపు శ్రీనివాస్, ఎంపీటీసీ రాణి, ఉపసర్పంచ్ నవీన్, బండి స్వామి, సురేశ్, రాజేందర్, మునుగూరి రాజు, బండి రాజు, స్వామి, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

కడెం మండలంలో..

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్, లింగాపూర్ గ్రామాల్లో తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించగా ఎమ్మెల్యే రేఖానాయక్ పాల్గొని మాట్లాడారు. డీఆర్డీవో విజయలక్ష్మి, ఏపీడీ గోవిందరావు, సర్పంచ్‌లు బొడ్డు గంగన్న, ఆకుల బాలవ్వ, మంగ, సతీష్, కడెం తహసీల్దార్ చిన్నయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీఓ ఉపేందర్, ఈజీఎస్ ఏపీవో జయదేవ్, అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించారు. అనంతరం పల్లె ప్రకృతివనం, క్రీడా ప్రాంగణం, నర్సరీలను ఎంపీపీ పద్మ పరిశీలించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ రాజేశ్వర్,స్థానిక సర్పంచ్ హైమావతి, ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దీన్, ఏపీఎం వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. జాతీయ జెండా ఆవిష్కరించి పల్లె ప్రగతిపై అవగాహన ర్యాలీలు తీశారు. డీఎల్‌పీవో శివకృష్ణ, సర్పంచ్ సమత, పీఏసీఎస్ చైర్మన్ గజ్జారాం, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం పాల్గొన్నారు. కల్లూరులో సర్పంచ్ పద్మాబాయి లక్ష్మణ్ పటేల్ దంపతులు పంచాయతీ ఆవరణలో ఎనిమిది మంది పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగి సన్మానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గంగామణి, పీఆర్ డీఈ సురేశ్, కార్యదర్శి శ్రావణ్, పురుషోత్తం, దత్తు, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మామడ: మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు సన్మానం నిర్వహించారు. పొన్కల్‌లో సర్పంచ్ భూమేశ్వర్, ఉపసర్పంచ్ నరేశ్‌రెడ్డి, కార్యదర్శి సాయికృష్ణరెడ్డి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌లు జాతీయజెండా ఆవిష్కరించారు. పల్లె ప్రగతిలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించారు. పతాని రాధ, ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ముంతాజ్ ఉన్నారు.

సోన్: మండలంలోని గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధిని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రజలకు వివరించారు. పారిశుధ్య కార్మికులను, అంగన్‌వాడీ టీచర్లను ఐకేపీ వీవోఏలను సన్మానించారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన వెల్మల్, బొప్పారం గ్రామాలకు చెందిన ఆకాంక్ష, ప్రవళికను సన్మానించారు. న్యూవెల్మల్‌లో నూతన పంచాయతీకి భూమి పూజ చేశారు. సోన్‌లో కార్యదర్శి లక్ష్మణ్ పల్లెప్రగతి నివేదిక చదివి వినిపించారు. సోన్ సర్పంచ్ వినోద్ కుమార్ చేపట్టిన పనులు వివరిస్తుండగా ప్రజలు ప్రశ్నించడంతో మధ్యలోనే వెళ్లిపోయారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు.

భైంసారూరల్: మండలంలోని ఆయా పంచాయతీల్లో ప్రజా ప్రతినిధులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం పంచాయతీ కార్మికులకు ప్రశంసాపత్రాలు అందించి శాలువాలతో సత్కరించారు. ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర, పంచగుడి, వట్టోలి, పిప్రి, గడ్‌చాంద, నగర్, పుస్పూర్ తదితర గ్రామాల్లో పంచాయతీ ఆవరణలో జాతీయ జెండాలను సర్పంచ్‌లు ఎగురవేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. గ్రామసభలు నిర్వహించి పదేళ్లలో చేసిన అభివృద్ధి వివరించారు. వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, సర్పంచ్‌లు ఎల్లన్న, మంద శారద, రజిత, ముత్యంరెడ్డి, నరేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ముత్తగౌడ్ పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గురువారం జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్య కార్మికులను సన్మానించి ప్రశంసాపత్రం అందించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలంలోని 13 గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌లు జాతీయజెండాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా గ్రామసభలను నిర్వహించి అభివృద్ధిని వివరించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఎంపీపీ సింగరి కిషన్, ఎంపీడీవో భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ తెంగారావ్, వైస్ ఎంపీపీ రాజునాయక్, ఉపసర్పంచ్ గోపాల్, కార్యదర్శి ఇందుమతి పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



డెయిరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దేగాం గ్రామంలో విజయ పాల డెయిరీని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు వేల లీటర్ల కెపాసిటీతో బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్‌ను నిర్మించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సూర్యకాంత్‌రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జేకే పటేల్, పశువైద్యాధికారి విఠల్, రాంరెడ్డి, పోతన్న, ఎల్లప్ప, రవీందర్, సురేశ్ తదితరులు ఉన్నారు.

మండలంలోని సుంక్లి గ్రామంలో రూ.50 లక్షలతో చేపట్టే కల్యాణ మండప నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రూ.5లక్షలతో నిర్మించిన రజక సంఘ భవనాన్ని ప్రారంభించారు. భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబు, సర్పంచ్ కుసుమల, ముత్యంరెడ్డి, గనేశ్, రమేశ్‌గౌడ్, రాజారెడ్డి, హరీశ్, రాంకుమార్, ముత్యంరెడ్డి తదితరులు ఉన్నారు.

'సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి'

ఖానాపూర్: బాసర ట్రిపుల్ ఐటీలో వరుసగా జరుగుతున్న ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని లంబాడా హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు బి.గోవింద్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుని ఆత్మహత్యలు పునరావృతం కాకుండా దృష్టి సారించాలన్నారు.

'ఆత్మహత్యలకు ప్రభుత్వమే కారణం'

ఖానాపూర్: ప్రభుత్వ వైఫల్యం కారణంగానే బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని వైఎస్సార్ తెలంగాణ పార్టీ యూత్ మండలాధ్యక్షుడు ఎగుర్ల మహేష్ అన్నారు. స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల ఆత్మహత్యపై ప్రతిపక్షాల గొంతునొక్కేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. బాధ్యత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50లక్షలతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు.

బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



నిర్మల్‌లో బాబా ఆలయంలో భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం పూజలు నిర్వహించారు. ఆలయ సింగిల్ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు భారీగా పాల్గొన్నారు. గురువారం అన్నదాతలుగా నిలిచిన జిట్టా లావణ్య– నరేందర్, శ్రీదేవి, అలేఖ్య–శ్రావణ్ దంపతులను సన్మానించారు. జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో నిర్మించిన కల్యాణ మండపాన్ని అద్దెకు ఇస్తామని.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేవా సమితి సభ్యులు ఉప్పుల నందు, జిందం గోవర్ధన్, సోమేశ్, భూషణ్, చౌదరి, శ్రీధర్, రేణుక దాస్ పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. నియోజకవర్గంలోని పలు మండలాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

సంక్షిప్త వార్తలు

'అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు యత్నిస్తున్న మున్సిపల్ చైర్మన్'

ఖానాపూర్: పట్టణంలో రూ.62 లక్షలతో నిర్మించిన వైకుంఠధామం పనుల్లో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు మున్సిపల్ చైర్మన్ రాజేందర్ యత్నిస్తున్నాడని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం, బీజేపీ పట్టణాధ్యక్షుడు నాయిని సంతోష్ అన్నారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్మశానవాటిక ప్రారంభించి ఏడాది గడవకముందే పలుమార్లు దెబ్బతిన్న వైకుంఠధామానికి విపత్తును సాకుగా చూపుతూ పదేపదే మరమ్మతులు చేస్తూ అధిక బిల్లులు కాజేస్తున్నారని అన్నారు. కాంట్రాక్టర్ తాలూకు ప్రభుత్వం వద్ద రెండు శాతం ఈఎండీ బడ్జెట్ 2 సంవత్సరాలు ఉంటుందని, విపత్తులో దెబ్బతిన్న వైకుంఠధామాన్ని ఆ నిధులతో ఎందుకు మరమ్మతు చేయడం లేదని ప్రశ్నించారు. నాణ్యతపై బహిరంగ విచారణ చేయకుండా కాంట్రాక్టర్‌ను ఎందుకు వెనకేసుకొస్తున్నారని ప్రశ్నించారు. పనుల్లో అవినీతిపై అఖిలపక్షం ఆధ్వర్యంలో కలెక్టర్‌తో పాటు రాష్ట్ర విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

హక్కుపత్రాలు ఇవ్వాలి

ఖానాపూర్: పోడుభూములు సాగు చేసుకుంటూ దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం హక్కుపత్రాలు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో జిల్లా అధ్యక్షులు ఆత్రం బలవంత్‌రావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో గిరిజన రైతులు 5,076 మంది 14,955 ఎకరాలకు.. గిరిజనేతర రైతులు 3,590 మంది 10,037 ఎకరాలకు హక్కుపత్రాల కోసం దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. ప్రతీ పంచాయతీలో నోటీస్ బోర్డు ఏర్పాటు చేసి అటవీహక్కు దారుల పేర్లను బహిర్గతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మేస్రం నాగోరావు, పెంద్రం దత్తురాం, మేస్రం అనిల్, పెంద్రం నాగోరావు, మరప హన్మంత్‌రావు, వర్మ తదితరులు ఉన్నారు.

శ్రీహరిరావును కలిసిన నాయకులు

ఖానాపూర్: జిల్లా కేంద్రంలోని తన నివాసంలో తెలంగాణ ఉద్యమకారుడు కూచాడి శ్రీహరిరావును గురువారం ఖానాపూర్ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ జెండా ఎగిరేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. చిన్నం సత్యం, దయానంద్, గంగనర్సయ్య, నిమ్మల రమేశ్, జహీర్, మాజీద్, శ్యాం, సలీంఖాన్ తదితరులు ఉన్నారు.

జిల్లా వాసికి సిల్వర్ మెడల్

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐదో తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో అండర్–30 సీనియర్ బ్లాక్ బెల్ట్ కేటగిరి విభాగంలో జిల్లా తరఫున పాల్గొన్న దయాత్ అక్షయ్‌కు సిల్వర్ మెడల్ లభించింది. ఈ సందర్భంగా ఒలంపిక్స్ సెక్రెటరీ మహేశ్వర్.. అక్షయ్‌ను అభినందించారు.

పరామర్శ

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు మాలానా సుల్తాన్ భర్త మొయిన్ గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే రేఖానాయక్ పరామర్శించారు. వారి వెంట శ్యాంనాయక్ తదితరులు ఉన్నారు.